ప్రగతిని వివరిస్తూ.. ప్రజలతో మమేకమవుతూ..

- 23న నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



బస్సు యాత్రకు సంబంధించి నియోజకవర్గ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఈ నెల 23న నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు వివరించి, సంక్షేమాభివృద్ధి పథకాలతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని చెప్పేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. బస్సు యాత్రలో ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 200 మందితో కలిసి డైమండ్‌పార్క్ సమీపాన సహపంక్తి భోజనం చేస్తారన్నారు. తర్వాత సమీపంలో గల హోటల్లో సమావేశమై యాత్ర గురించి వివరించనున్నారని చెప్పారు. బస్సు యాత్ర వెళ్లే మార్గంలో నాయకులు ముందుగా నిర్ణయించిన చోట్ల ప్రజలతో మమేకం అవుతారన్నారు. అనంతరం కొన్ని స్టాప్‌లు పెట్టి స్వాగతించేలా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో బస్సుపై ఏర్పాటు చేసిన వేదిక నుంచి ముఖ్య నాయకులు మాట్లాడనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఇలా..

ఈ నెల 23న ముందుగా డైమండ్ పార్క్ సమీపాన గల ఓ హోటల్ నుంచి ప్రారంభమై రైల్వే న్యూకాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, గోకుల్ థియేటర్, అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ స్కూల్ (నాడు–నేడు), వైఎస్సార్ అర్బన్ క్లినిక్ (మనోరమ థియేటర్ వద్ద), రామకృష్ణా రైతుమార్కెట్, డాల్ఫిన్ హోటల్ రోడ్డు మీదుగా జగదాంబ జంక్షన్‌కు చేరుకోనుంది. జంక్షన్లో గల మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు మీదుగా సీహార్స్ జంక్షన్ వరకు సాగనుంది. అక్కడి సభా ప్రాంగణంలో నాయకులు ప్రసంగిస్తారని ఎమ్మెల్యే వాసుపల్లి తెలిపారు.

మార్కెట్‌కు దీపావళి శోభ



అల్లిపురం కుమ్మరివీధిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆకట్టుకుంటున్న డిజైనర్ ప్రమిదలు

అల్లిపురం : దీపావళిని పురస్కరించుకుని అల్లిపురం మార్కెట్‌తో పాటు రామకృష్ణా రైతు మార్కెట్ శనివారం కళకళలాడాయి. చెరకు గడలు, ఆముదం కర్రలు, గోంగూర కాడల అమ్మకాలు జోరుగా సాగాయి. చెరుకుగడ ఒకటి రూ.30 నుంచి రూ.50, ఆముదం కర్ర సైజును బట్టి రూ.10 నుండి రూ.20కు అమ్ముతున్నారు. పువ్వుల ధరలు కూడా డజను బంతి పూలు రూ.30 నుండి రూ.40కి అమ్ముతున్నారు. కొబ్బరికాయ సైజుని బట్టి రూ.25 నుండి రూ.35కి అమ్ముతున్నారు. మందుగుండు సామగ్రి అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. పోలీసులు నిఘా పెట్టటంతో చిరువ్యాపారులు వాటిని అమ్మడానికి భయపడుతున్నారు. ఆదివారం అమావాస్య కావటంతో దిష్టి గుమ్మడికాయలు, నిమ్మకాయల అమ్మకాలు జోరుగా సాగాయి. డిజైనర్ దీపాలు, మట్టి ప్రమిదల అమ్మకాలతో అల్లిపురం కుమ్మరవీధి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఈ ప్రాంతంలో కలకత్తా దీపాలు, రంగు రంగుల దీపాలు, లక్ష్మీదేవి పూజ సందర్భంగా వినాయకుడు, లక్ష్మీదేవి ప్రతిమల అమ్మకాలు జోరందుకున్నాయి. వీధుల్లో ఎక్కడా బాణసంచా హడావుడి అంతగా కనిపించలేదు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



29వ వార్డులో చందక సూరిబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



32వ వార్డు నేరేళ్లకోనేరుకు చెందిన షేక్ బాషాకు ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. తన సొంత నిధుల నుంచి ఏడుగురికి రూ.35 వేలు అందజేశారు. 32వ వార్డు నేరేళ్లకోనేరు ప్రాంతానికి చెందిన కరణం అప్పలరాజు నరాల బలహీనతతో బాధపడుతున్న దృష్ట్యా రూ.5వేలు, అదే ప్రాంతానికి చెందిన షేక్ బాషా పక్షవాతం, కిడ్నీ సమస్యతో మంచానికే పరిమితం కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రూ.5 వేలు, 35వ వార్డు వెలంపేటకు చెందిన మాటల సతీష్ పక్షవాతంతో బాధపడుతుండడంతో అతని ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కల్లుపాకలు ప్రాంతానికి చెందిన ఉల్లాకుల రమణ పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు, 29వ వార్డు భారతి ఆస్పత్రి ప్రాంతానికి చెందిన చందక సూరిబాబు పక్షవాతంతో బాధపడుతూ కదల్లేని స్థితిలో ఉన్న కారణంగా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, వేంకటేశ్వరనగర్‌కు చెందిన కుప్పిశెట్టి అమ్మాజమ్మ ఇటీవల పడిపోవడం వల్ల కాళ్లు విరిగిపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉన్నందున రూ.5 వేలు, ఊటగెడ్డ ప్రాంతానికి చెందిన నల్లా లక్ష్మీనారాయణ పక్షవాతం, టీబీతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టలోని వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పూలరథంపై సాము గరిడీలు, మహిళలచే కోలాటం, తప్పిటగుళ్లు, తోడపెద్దు సేవలతో కోలాహలంగా అమ్మవారిని తోడ్కొని వచ్చారు. వేంకటేశ్వరమెట్ట వాసులు అమ్మవారికి ఘనంగా స్వాగతం పలకగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై రాత్రి 11.31 గంటలకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రాణప్రతిష్ట చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి శ్రీనివాసరావు, శరగడం మోహనరావు, గ్రంథాలయ కార్యవర్గం, మహిళా మండలి ప్రతినిధులు, గ్రామ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఊరేగింపులో మహిళల కోలాటం



ప్రత్యేక రథంపై తరలి వస్తున్న గౌరీపరమేశ్వరులు

క్లుప్తంగా

ఆజాద్ సేవలు ఎనలేనివి

- జేసీ కె.ఎస్.విశ్వనాథన్
- ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : భారత విద్యా వ్యవస్థ బలోపేతానికి అబ్దుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని, తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఎన్నో సేవలందించారని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి జేసీ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. హిందూ, ముస్లిం వర్గాల్లో ఐక్యతకు కృషి చేశారని అన్నారు. ఆజాద్ సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సిరాజుల్లా, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, మార్కెటింగ్ ఏడీ యాసిన్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ షర్టుల అందజేత



ఆటో డ్రైవర్లకు ఖాకీ షర్టులు అందజేస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

మహారాణిపేట : జీవీఎంసీ 29వ వార్డు జిల్లా పరిషత్ జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహకారంతో కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు 150 మంది ఆటో డ్రైవర్లకు ఖాకీ షర్టులు శనివారం పంపిణీ చేశారు. వార్డులో నాలుగు ఆటో స్టాండ్లకు చెందిన డ్రైవర్ సోదరులు ఖాకీ షర్టులు ఇవ్వాలని తనను సంప్రదించగా తాను సీనియర్ నాయకుడు సీతంరాజు సుధాకర్‌ను అడిగినట్టు నారాయణరావు వివరించారు. అడిగిన వెంటనే ఖాకీ షర్టులు అందజేసిన సీతంరాజు సుధాకర్‌కు, కార్పొరేటర్ నారాయణరావుకు ఆటో డ్రైవర్లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, నిఖిలేష్ రాజ్‌కుమార్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చిలో బిషప్ కాగితపు మరియదాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్ పోస్టర్‌ను శనివారం ముఖ్య అతిథులు ఆర్‌సీఎం విశాఖ చాన్స్‌లర్, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, వార్డు సీనియర్ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆవిష్కరించారు.

ఈ నెల 29 నుంచి డిసెంబర్ 4 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నామని, 12 టీమ్‌లకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి, స్వామినాథన్, బోర శేషుబాబు, బేతా జోసెఫ్, అమర్, రాజేష్‌బాబు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు

ట్రేడ్ లైసెన్స్‌ల మంజూరుకు వినతి

- పరిశీలించి.. మంజూరు చేస్తామంటున్న అధికారులు



రామకృష్ణా రైతుబజార్

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో రూ. 5 కోట్లతో నిర్మించిన 152 దుకాణాలను అధికారులు ఐదేళ్ల కిందటే వ్యాపారులకు అందజేశారు. అయితే ట్రేడ్ లైసెన్సులు మాత్రం ఇవ్వలేదు. నగరంలో పూర్ణామార్కెట్ తర్వాత అంతటి ప్రాముఖ్యత గల రామకృష్ణా రైతుబజార్‌లో నిత్యం రూ. లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయకపోవడం వల్ల జీవీఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోతుందని పలువురు పేర్కొంటున్నారు. తమకు జీవీఎంసీ ట్రేడ్ లైసెన్సులు ఇస్తే తమ దుకాణాలను అభివృద్ధి చేసుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఏఎంహెచ్‌వో ఎ. రాజేష్ మాట్లాడుతూ రామకృష్ణా రైతుబజార్ వ్యాపారులకు ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్సులు ఎందుకు ఇవ్వలేదనే విషయంపై ముందుగా పరిశీలన చేస్తామన్నారు. ఆ తర్వాతే లైసెన్సులు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. నగరంలోని దుర్గానగర్‌కు చెందిన సంగు ఆంజనేయ రెడ్డి లక్షా 1116 రూపాయలు అందజేశారు. దాతకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అన్నప్రసాద బాండ్ అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి హనుమంతవాకకు చెందిన ఎం.అప్పలనాయుడు, సత్యంనాయుడు అనే దాతలు లక్షా 116 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు సూపరింటెండెంట్ కనకరాజు అన్నప్రసాద బాండ్ అందజేశారు. పీఆర్‌వో నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా రాంభట్ల

సీతంపేట: ఈ నెల 10 నుంచి ప్రారంభమైన తిరుచానూరు పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా విశాఖకు చెందిన కవి, వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మకు అవకాశం దక్కింది. 15వ తేదీ సాయంత్రం 4 నుంచి 5.30 వరకు స్వర్ణ రథం, రాత్రి 7 నుంచి 9 వరకు గరుడ వాహన, 16న ఉదయం 8 నుంచి 10 వరకు సూర్యప్రభ వాహనోత్సవాలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేయనున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తి చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే ఈ బ్రహ్మోత్సవాలకు ఇలాంటి అవకాశం రావడం ఇది పన్నెండోసారని రాంభట్ల తెలిపారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.